# సాక్షి
## ఆదిలాబాద్

మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025






### మళ్లీ కంప్యూటర్ విద్య

పాఠశాలల్లో మళ్లీ కంప్యూటర్ విద్య అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు కంప్యూటర్లు సరఫరా చేసింది. 8లో▸



### కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

తలమడుగు మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం సుదర్శన మహాయజ్ఞం నిర్వహించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
36.0/19.0

### వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

## సాలెగూడకు.. ట్యాంకరొచ్చింది



ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: మండలంలోని తేజాపూర్ గ్రామపంచాయతీ పరిధి సాలెగూడలో తాగునీటి ఇక్కట్లపై 'సాక్షి'లో సోమవారం 'గొంతెండుడేనా.., సాలెగూడలో నీటిగోస' శీర్షికన ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భానుకుమార్, ఎంపీవో జీవన్ రెడ్డి ఉదయాన్నే గ్రామాన్ని సందర్శించారు. తాగునీటి కోసం గ్రామస్తుల ఇక్కట్లను పరిశీలించారు. వెంటనే ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా ప్రారంభించారు. అధికారులు మాట్లాడుతూ, వేసవి ముగిసేంత వరకు నిరంతరం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి పూర్ణ, మాజీ సర్పంచ్ కామేశ్వరి ఉన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

## ఆ నిర్మాణ పనులకు.. బ్రేక్

కైలాస్‌నగర్: మున్సిపల్ నుంచి అనుమతులు లేకుండా పట్టణంలోని ఓంకార్ మాల్ జిన్నింగ్‌మిల్లులో అక్రమంగా కమర్షియల్ కాంప్లెక్స్ భవన నిర్మాణం చేపడుతుండడాన్ని వివరిస్తూ 'దర్జాగా.. అక్రమం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి బల్దియా అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది రాజన్న, క్రాంతి సోమవారం జిన్నింగ్‌మిల్లులోని అక్రమ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. పనులు నిలిపివేయాలని పేర్కొంటూ భవన యజమానికి నోటీసు అందజేశారు. కాగా, అనుమతుల్లేకుండా ఎలాంటి కట్టడాలు చేపట్టవద్దని కమిషనర్ పేర్కొన్నారు.

## పత్తి కొను'గోల్‌మాల్'పై తనిఖీలు

ఆదిలాబాద్‌టౌన్: పత్తి కొనుగోళ్ల గోల్‌మాల్ వ్యవహారంలో 'తిలా పాపం.. తలాపిడికెడు' శీర్షికన ఈనెల 14న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ రాజర్షిషా స్పందించారు. విచారణ అధికారులుగా నియమితులైన జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌స్వామి, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్‌లు ఇచ్చోడ వ్యవసాయ కార్యాలయంలో సోమవారం తనిఖీలు చేపట్టారు. టీఆర్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇచ్చోడ ఏవో కైలాస్, పలువురు ఏఈవోలను విచారించారు. వారి నుంచి వివరాలు సేకరించారు. ఇచ్చోడతో పాటు జిల్లాలోని ఆయా మండలాల్లో టీఆర్ బుక్‌లను పరిశీలించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి పేర్కొన్నారు.

## వలలు తొలగించారు.. పక్షులను రక్షించారు

ఇంద్రవెల్లి: పంటల రక్షణ కోసం రైతులు ఏర్పాటు చేసిన వలలకు చిక్కుకుని చనిపోతున్న పక్షులపై 'సాక్షి'లో సోమవారం 'పంటలకు రక్షణ.. పక్షులకు ప్రాణాంతకం' శీర్షికన ప్రచురితమైన కథనానికి అటవీ అధికారులు స్పందించారు. మండల కేంద్ర శివారుతో పాటు అంజీ, మామిడిగూడ గ్రామాలను సందర్శించారు. రైతులు పంటల రక్షణ కోసం ఏర్పాటు చేసిన వలలను తొలగించారు. ఈ సమయంలో పలు పక్షులు అందులో చిక్కుకొని ఉండగా వాటిని రక్షించి అటవీ ప్రాంతంలో వదిలేశారు. ఎఫ్ఎస్‌వో చంద్రారెడ్డి మాట్లాడుతూ, అటవీ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆయన వెంట ఎఫ్‌బీవోలు నిషంత్, పద్మజ, నికిత, అఖిల్ తదితరులున్నారు.



వలలను తొలగించిన అటవీశాఖ అధికారులు, సిబ్బంది



వలలో చిక్కిన చిలుకకు నీటిని తాగిస్తున్న ఎఫ్‌బీవో

## ఇసుకాసురులపై పోలీసుల కొరడా



సీజ్ చేసిన ట్రాక్టర్లతో జైనథ్ సీఐ, సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: ఇసుక అక్రమార్కులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. పెన్‌గంగ నుంచి ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి 'తోడేస్తున్నారు..' శీర్షికన 'సాక్షి'లో సోమవారం కథనం ప్రచురితమైంది. ఈ మేరకు పోలీసు అధికారులు స్పందించారు. పలుచోట్ల తనిఖీలు చేపట్టారు. బేలలోని కాంగర్‌పూర్ సమీపంలోని ఘాట్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. వాటిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. అలాగే మైనింగ్ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. పెన్‌గంగ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మొదటిసారి జరిమానా విధిస్తామని, రెండోసారి పట్టుబడితే ఇసుక దొంగతనం కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఎక్కడైనా ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడుల్లో జైనథ్ సీఐ సాయినాథ్, బేల ఏఎస్సై లింగన్న, కానిస్టేబుళ్లు దత్తు, వెంకటేశ్ పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### వేడుకలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ సురేందర్ రావు

ఆదిలాబాద్‌టౌన్: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని ఏఎస్పీ సురేందర్ రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని వన్‌టౌన్‌లో సీఐలు, ఎస్సైలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19న శివాజీ జయంతి సందర్భంగా ర్యాలీ కోసం మూడు సంఘాలు వేర్వేరుగా దరఖాస్తు చేసుకున్నాయన్నారు. షరతులతో కూడిన ర్యాలీకి అనుమతి ఇచ్చేందుకు ఆర్డీవోకు పంపినట్లు తెలిపారు. ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బాధ్యత వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ పాటించాలని పేర్కొన్నారు. ఇందులో డీఎస్పీ జీవన్‌రెడ్డి, టూటౌన్, రూరల్, జైనథ్ సీఐలు కరుణాకర్‌రావు, ఫణిందర్, సాయినాథ్, ఎస్సైలు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### ప్రజలు 'కేసీఆర్ ప్రభుత్వాన్ని' కోరుకుంటున్నారు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు 'జోగు'
- ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ప్రజలు మరోసారి కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కేక్ కట్ చేశారు. అనంతరం గంగపుత్ర శివాలయంలో పూజలు చేసి అన్నదానం ప్రారంభించారు. ఈద్గా మైదానంతో పాటు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కలు నాటారు. పార్టీ కార్యాలయంలో ఒక్కో కార్యకర్తకు మూడు మొక్కలు అందించి నాటాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పదేళ్లలో దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అజయ్, నారాయణ, మెట్టు ప్రహ్లాద్, యూనిస్ అక్బాని, సాజి తోద్దీన్, స్వరూప రాణి, మమత, కరుణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే జైనథ్‌లోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో రామన్న ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట నాయకులు నారాయణ, లింగారెడ్డి, వెంకటరెడ్డి, గణేశ్‌యాదవ్ తదితరులున్నారు.

**చిత్రం గీసి.. శుభాకాంక్షలు తెలిపి**

తాంసి: కేసీఆర్ జన్మదినం సందర్భంగా మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన చిత్రకారుడు గట్టు రాజు స్వయంగా మాజీ సీఎం చిత్రపటాన్ని పెన్సిల్‌తో గీశాడు. ఇలా శుభాకాంక్షలు తెలిపి తన అభిమానాన్ని చాటుకున్నాడు.



పెన్సిల్‌తో గీసిన కేసీఆర్ చిత్రపటాన్ని చూపుతున్న రాజు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా గుడిహత్నూర్‌కు చెందిన బ్రహ్మానంద్‌ను మరోసారి కొనసాగిస్తూ ఇటీవల పార్టీ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే పార్టీలో సీనియర్ నాయకులు ఈ నియామకంపై నారాజ్‌గా ఉన్నారని ప్రచారం సాగుతోంది. ప్రధానంగా జిల్లా అధ్యక్ష నియామకానికి సంబంధించి కనీసం పార్టీలో అభిప్రాయ సేకరణ చేయలేదని, ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని సీనియర్లు వాపోతున్నారు.
- నేరడిగొండ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్న సాబ్లే సంతోష్ సింగ్ రెండు రోజుల క్రితం పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరడం ప్రాధాన్యత సంతరించుకుంది. మండల అధ్యక్షులకు కనీస మర్యాద, సమాచారం ఇవ్వకుండా అవమానించడం బాధకు గురి చేసిందని, విషయాన్ని పెద్దల దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితిలో మార్పు రాలేదని సంతోష్ సింగ్ తన రాజీనామా పత్రంలో పేర్కొన్నాడు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీజేపీ కార్యకర్తలు, నాయకులు తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనై ఉన్నారని అందులో పేర్కొనడం గమనార్హం.
- నెల క్రితం కొన్ని మండలాలకు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. అయితే ఈ నియామకాలు ఏకపక్షంగా సాగాయని పలు మండలాల్లో ఆరోపణలు వ్యక్తమయ్యాయి. అంతే కాకుండా పార్టీలో పాత నాయకులను విస్మరించి కొత్తవారికి అవకాశం కల్పించారని పలువురు ఆరోపించారు. భీంపూర్ మండల బీజేపీ నూతన అధ్యక్షుడు అంకం అశోక్‌ను మార్చాలంటూ పార్టీ క్యాడర్ మండలానికి వచ్చిన ఎంపీ గోడం నగేశ్‌కు వినతి పత్రం అందజేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. బేల మండలంలో బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన ఆ నాయకుడిని మండల అధ్యక్షుడిగా నియమించడం అభ్యంతరాలకు దారి తీసింది.
- పార్టీ ఆదిలాబాద్ పట్టణ అధ్యక్షులుగా తొలిసారి ఇద్దరిని నియమిస్తూ నిర్ణయం తీసుకోవడంపై కార్యకర్తల్లో విస్మయం వ్యక్తమవుతుంది. మొదట ముగ్గురిని నియమించాలని భావించినప్పటికీ ఈ విషయంలో పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఇద్దరితో సరిపెట్టినట్లు పార్టీలో చర్చ సాగుతోంది. ప్రస్తుతం పట్టణ అధ్యక్షులుగా వేదవ్యాస్, గంద్రత్ మహేందర్ ఉన్నారు.

# బీజేపీలో లుకలుకలు!

- పదవుల విషయంలో పలువురిలో అసంతృప్తి
- ప్రాధాన్యత ఇవ్వలేదంటున్న సీనియర్లు
- ఎంపీ గోడం, ఎమ్మెల్యే 'పాయల్'పైనే సమన్వయ భారం
- 'స్థానిక' ఎన్నికల ముందు పార్టీలో అంతర్గత లొల్లి



సాక్షి,ఆదిలాబాద్: బీజేపీలో లుకలుకలు బయట పడుతున్నాయి. ప్రధానంగా ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ నాలుగు ఎమ్మెల్యే స్థానాలు కలిగి ఉండటం, ప్రస్తుతం పదవీకాలం ముగిసినప్పటికీ గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇటు జెడ్పీటీసీ, అటు ఎంపీటీసీ, బల్దియాలో కౌన్సిలర్లుగా పలువురు కాషాయ పార్టీ నుంచి గెలుపొందారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల ముందు పటిష్టంగా ఉండాల్సిన పార్టీలో అంతర్గతంగా విభేదాలు బయటపడుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధానంగా ఎంపీ గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఈ పరిస్థితులను చక్కదిద్ది పార్టీలో సమన్వయం తీసుకురావాల్సిన పరిస్థితులు ఉన్నాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

**విభేదాలు ఇలా..**

ఇదివరకు పార్టీ అధ్యక్ష పదవిని సీనియర్ నేతలు చిట్యాల సుహాసినిరెడ్డి, ఆదినాథ్, వేణుగోపాల్, జ్యోతిరెడ్డి ఆశించారు. అయితే అనూహ్యంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ అనుచరుడు బ్రహ్మానంద్‌ను పార్టీ నియమించడంపై అప్పట్లోనే ఈ సీనియర్ నేతలు నిరుత్సాహానికి గురయ్యారు. తాజాగా జిల్లా అధ్యక్షుడిగా తిరిగి ఆయననే కొనసాగించడం, ఈ నిర్ణయంపై తమకు కనీసం సమాచారం ఇవ్వకపోవడం, పోటీ ఆసక్తిపై అడగకపోవడంపై వారు పెదవి విరుస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలను విస్మరించి ఇలా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సబబు కాదన్న విమర్శలు పార్టీలో వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సీనియర్ నేతలు ప్రస్తుతం పార్టీ వ్యవహారాల్లో సైలెంట్ కావడం, పలు కార్యక్రమాల్లో అంటిముట్టనట్లు వ్యవహరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల వరకు పట్టణ అధ్యక్షుడిగా కొనసాగిన లాలామున్నా కొంతకాలంగా ముఖ్య నేతకు దూరంగా ఉంటూ వచ్చారనే ప్రచారం పార్టీలో ఉంది. తాజాగా మున్నాను మరోసారి పట్టణ అధ్యక్షుడిగా కొనసాగించకుండా పార్టీలో వేరే వారికి అవకాశం కల్పించారు. మొత్తంగా పార్టీలో సీనియర్ నేతలకు, ముఖ్య నేత మధ్య సఖ్యత లేదన్న ప్రచారం సాగుతోంది. అంతే కాకుండా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే కార్యకర్తలు ప్రస్తుతం ఇటు పార్లమెంట్ పరిధిలో, అటు నియోజకవర్గ స్థాయిలో ఏమైనా పనుల కేటాయింపులోనూ నేతలు తమను విస్మరిస్తున్నారనే అసంతృప్తి వారిలో ఉంది. అంతేకాకుండా పార్టీలో ఒక నాయకుడికి ఎలాంటి పదవులు లేకున్నప్పటికీ ముఖ్య సమావేశాల్లో ఆయనను వేదికలపై కూర్చోబెట్టడం, రాష్ట్రనేతలను కలిసినప్పుడు కూడా అతను వెంట ఉండటంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సోషల్ మీడియా వేదికగా ఆ నాయకుడిని తూర్పారా బడుతూ పార్టీ నాయకులే పోస్టులు పెట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. మొత్తంగా ప్రస్తుతం బీజేపీలో అంతర్గతంగా సాగుతున్న ఈ కలహాలు ఎప్పుడో బయటపడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### ప్రత్యేక తరగతులను పర్యవేక్షించాలి

కైలాస్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను నిత్యం పర్యవేక్షించాలని మండల ప్రత్యేకాధికారులను కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, స్నాక్స్ అందేలా దృష్టి సారించాలన్నారు. అలాగే వారు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజు ప్రత్యేక తరగతులకు హాజరై విద్యార్థులకు సూచనలు, సలహాలు అందజేయాలన్నారు. అనంతరం జన్‌మన్ యోజన కింద చేపడుతున్న అంగన్‌వాడీ భవనాలకు మంజూరైన వాటి నివేదికలు త్వరగా పంపాలని డీడబ్ల్యూవోను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్‌కుమార్, డీఈవో ప్రణీత, డీడబ్ల్యూవో సబిత, డీఆర్డీవో రవీందర్ రాథోడ్ పాల్గొన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అనిల్ జాదవ్

నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 24న నిర్వహించనున్న శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి పోస్టర్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు.

# అంగట్లో ఓటర్ల ఫోన్ నంబర్లు!

- 'నేను మీ ఎమ్మెల్సీ అభ్యర్థిని.. బ్యాలెట్ పేపర్‌లో నాది ఫలానా నంబర్. మీ పోలింగ్ బూత్ నంబర్ ఇదీ.. మీ మొదటి ప్రాధాన్యత ఓటు నాకే వేసి గెలిపించగలరు' ఇదీ మంచిర్యాలకు చెందిన ఓ పట్టభద్రుడికి వచ్చిన ఫోన్. ఇలా అతడికి రోజూ పదుల సంఖ్యలో కాల్స్ వస్తున్నాయి. కానీ సదరు ఓటరు ఏ అభ్యర్థికీ తన ఫోన్ నంబర్ ఇవ్వలేదు. అయినా కాల్స్ ఎలా వస్తున్నాయో అర్థం కాక తల పట్టుకుంటున్నాడు. టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు సైతం ఇదే తరహాలో ఫోన్లు, మెస్సేజ్‌లు చేస్తున్నారు.
- 'మా వద్ద పట్టభద్రులు, టీచర్ ఓటర్ల పేర్లు, అడ్రస్, ఫోన్ నంబర్ సహా వివరాలు ఉన్నాయి. మీకు కావాలంటే చెప్పండి. రూ.30 వేలు ఇస్తే మీకు పీడీఎఫ్ కాపీ పంపుతాం' అని ఓ స్వతంత్ర అభ్యర్థికి ఓ వ్యక్తి ఆఫర్ చేశాడు. 'నేను అంత ఇవ్వలేను' అని ఆ అభ్యర్థి చెబితే.. 'రాజకీయ పార్టీల వాళ్లు మాకు ఒక్కో పీడీఎఫ్‌కు రూ.50 వేలు ఇచ్చారు. ఇప్పటికే వారందరూ ఓటర్లకు ఫోన్లు, మెసేజ్‌లు, వాట్సాప్‌లో సందేశాలు పంపుతున్నారు. మీరు కూడా అలాగే ప్రచారం చేసుకోవచ్చు' అని సూచించాడు.



- ఓటరు నమోదు సందర్భంగా లక్షలాది మందివి సేకరణ
- ఒక్కో పీడీఎఫ్ కాపీకి రూ.20 వేల నుంచి రూ.50 వేలు
- కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు
- ఓటర్లకు నిత్యం కాల్స్, మెసేజ్‌లు

సాక్షి ప్రతినిధి,మంచిర్యాల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమకే మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలంటూ పట్టభద్రులు, టీచర్ల ఓటర్లకు నిత్యం పదుల సంఖ్యలో కాల్స్, మెసేజ్‌లు వస్తున్నాయి. కాల్ లిఫ్ట్ చేసే వరకూ ఫోన్లు మోగుతూనే ఉంటున్నాయి. ఒకరిద్దరు కాదు లక్షలాది మంది ఓటర్ల ఫోన్ నంబర్లకు ఇలా ఫోన్లు వస్తున్నాయి. కొందరు చాటుగా ఫోన్ నంబర్లు తీసుకుని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో నిత్యం ఓటర్లకు కాల్స్ వస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల స్థానానికి ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఓటర్లంతా విద్యావంతులే. కానీ, వారికి తెలియకుండానే ఫోన్ నంబర్లు సేకరించి నేరుగా అభ్యర్థుల ఫోన్లు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ఈ ఫోన్ నంబర్లను సైతం పైసలకు అమ్ముకోవడం గమనార్హం.

**ప్రైవేటు వ్యక్తుల చేతిలో..**

ఓటరు నమోదు సమయంలో ఎన్నికల సంఘం అధికార వెబ్‌సైట్, మాన్యువల్‌గా దరఖాస్తు చేసిన సమయంలో ఫోన్ నంబర్లను కూడా పేర్కొన్నారు. అలా అనేక మంది ఓటర్ల ఫోన్ నంబర్లు నిక్షిప్తమయ్యాయి. అయితే అధికార వెబ్‌సైట్‌లో నమోదు చేసిన వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచాలి. కానీ జిల్లాల్లో ఎన్నికల విభాగంలో పని చేస్తున్న కొందరు అధికారులు బయటకు ఇస్తున్నారు. బరిలో ఉన్న అభ్యర్థులు వివరాలు వాటిని కొనుగోలు చేసి వాడుకుంటున్నారు. ప్రచారం నుంచి సర్వేలదాకా పలు సంస్థలు, సోషల్‌మీడియా వేదికగా వాడుకుంటున్నాయి. చాలా మందికి ఒకటికి రెండుసార్లు ఫోన్లు చేస్తూ ఓటర్లకు చిరాకు తెప్పిస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ మందిని పలకరించేలా, నేరుగా ఫోన్ నంబర్లపైనే అభ్యర్థులు ఆధారపడుతున్నారు.

**లక్షలాది ఫోన్ నంబర్ల సేకరణ**

ఓట్ల కోసం లక్షలాది మంది ఓటర్ల వివరాలు సేకరించారు. ఎన్నికలు ముగిసినప్పటికీ వివిధ వ్యాపార ప్రకటనలు, ఇతరత్రా అవసరాల కోసం కూడా ఈ ఓటర్ల ఫోన్ నంబర్లు ఉపయోగించుకునే అవకాశం ఉంది. మహిళల ఫోన్ నంబర్లతోపాటు వారి సోషల్ మీడియా అకౌంట్లు లింకు ఉన్న వాటికి కూడా ప్రకటనలు పంపుతున్నారు. ఇలాంటి ఫోన్ కాల్స్‌తో సైబర్ నేరాలకు ఆస్కారం ఉంటుంది. అయితే కొందరు ఆ నంబర్ల నుంచి కాల్ రాగానే బ్లాక్ లేదా, స్పామ్‌గా రిపోర్టు చేస్తున్నారు.

- ప్రజావాణికి 69 దరఖాస్తులు
- స్వీకరించిన కలెక్టర్ రాజర్షి షా

# అర్జీలిచ్చి.. ఆవేదన వెలిబుచ్చి



దివ్యాంగుడి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: భూ సమస్య పరిష్కరించాలని ఒకరు.. పింఛన్ అందడం లేదని ఇంకొకరు.. రైతుభరోసా సాయం కోసం మరొకరు.. ఇలా తమ సమస్యల గోడును బాధితులు కలెక్టర్ రాజర్షి షాకు వినిపించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో బాధితుల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. వాటిని అధికారులకు అందజేస్తూ పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించేలా శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ వారం మొత్తం 69 అర్జీలు అందినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. బాధితుల్లో కొందరి నివేదన..

**• అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి**



నా పేరు సిర్రా దేవేందర్. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శిని. రిమ్స్‌లోని మలేరియా విభాగంలో రెండు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఉండగా పీహెచ్‌సీల్లో పనిచేసే ముగ్గురిని డీఎంహెచ్‌వో అక్కడికి డిప్యూటేషన్‌పై నియమించారు. దీంతో వారు వంతుల వారీగా విధులకు హాజరవుతున్నారు. ముగ్గురు పనిచేయాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే విధుల్లో ఉంటున్నారు. అది కూడా సమయపాలన పాటించడం లేదు. అక్రమ డిప్యూటేషన్లతో అటు మండల ప్రజలకు ఇటు రిమ్స్‌కు వచ్చే రోగులకు సరైన సేవలు అందడం లేదు. అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలని కలెక్టర్‌కు విన్నవించాను.

**• రైతు భరోసా నిధులు జమ కాలేదు..**



మేము బేల మండలంలోని సైద్‌పూర్ గ్రామానికి చెందిన రైతులం. ప్రభుత్వం మూడెకరాల్లోపు వారికి రైతుభరోసా నిధులు విడుదల చేశామని చెబుతున్నా ఇంకా మా బ్యాంకు ఖాతాల్లో మాత్రం జమకాలేదు. మేమంతా ఎకరం నుంచి మూడెకరాల లోపు రైతులమే. వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే ప్రభుత్వమే జమచేస్తుందని అంటున్నారు. విచారణ జరిపించి మాకు న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్‌ను కోరాం.

**• నీటి సమస్య తీర్చండి**



మాది నార్నూర్ మండలం సుంగాపూర్‌లోని గోండ్ గూడ. మా పేర్లు పెందుర్ లక్ష్మణ్, మెస్రం షేకు. మా గ్రామంలో ఏటా వేసవిలో నీటి ఎద్దడి తలెత్తుతుంది. ఉన్న 70 కుటుంబాలు కిలోమీటరు దూరంలో ఉన్న చేతిపంపు నుంచి నీళ్లు తెచ్చుకోవాలి. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటి అందులో నుంచి నీరు రావడం లేదు. గ్రామంలోని చేదబావికి పైపులైన్, విద్యుత్ సౌకర్యం కల్పించి తాగునీటి ఇక్కట్లు తొలగించాలని కలెక్టర్‌కు విన్నవించాం.

**• పాఠశాలకు పక్కా భవనం నిర్మించండి**



మేమంతా మావల మండలం బట్టిసావర్‌గాం పంచాయతీ పరిధిలో గల దుబ్బగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులం. పాఠశాలను తడకలతో కూడిన రేకుల షెడ్డులో కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరిగే కొద్దీ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై డీఈవోకు, సెక్టోరియల్ అధికారులకు విన్నవించగా మున్సిపల్ ఇంజినీర్ ద్వారా ప్లాన్ వేసి కలెక్టర్‌కు పంపించామని చెబుతున్నారు. పిల్లల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని పక్కా భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విన్నవించాం.

### కలెక్టరేట్ ఎదుట సీపీఐ ధర్నా

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ రూరల్ మండలం నిషాన్‌ఘాట్‌లోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కాలనీవాసులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదేళ్లుగా పేదలు అక్కడ గుడిసెల్లో నివసిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడం శోచనీయమన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి తాగు నీరు, విద్యుత్ సౌకర్యం వంటివి కల్పించాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు.



ధర్నా చేస్తున్న నాయకులు, కాలనీవాసులు

## క్లుప్తంగా

### పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి శివారులో పేకాట శిబిరంపై దాడిచేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం గ్రామ శివారులోని పేకాట శిబిరంపై దాడిచేసి కర్ణమామిడికి చెందిన జునగరి చంద్రయ్య, జునగరి ధర్మయ్య, జునగరి సదయ్య, జునగరి కనకరాజు, జునగరి సమ్మయ్య, బోగిరి సదయ్యను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,630 స్వాధీనం చేసుకుని గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

జైపూర్: మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన గడ్డం సత్యగౌడ్ సోమవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కి కల్లు తీసే క్రమంలో మోకుజారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో 108లో మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సత్యగౌడ్‌కు చేయి విరిగిపోగా నడుముకు బలమైన గాయం కావడంతో ఆపరేషన్ అవసరమని వైద్యులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు.

### సీడీపీవోగా ఎంపికైన కల్యాణి


కల్యాణి

లక్సెట్టిపేట : స్థానిక మున్సిపల్ పరిధిలోని మహాలక్ష్మి వాడకు చెందిన తేజ కల్యాణి సోమవారం విడుదలైన టీజీపీఎస్సీ ఫలితాల్లో మహిళా శిశు సంక్షేమశాఖలో సీడీపీవోగా ఎంపికైంది. ఎస్సీ కేటగిరీలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. మల్టీజోన్1లో 8వస్థానం, జనరల్‌లో 13వ స్థానాన్ని సాధించిన కల్యాణిని పలువురు అభినందించారు.

### ఎస్టీపీపీ ఈడీ బదిలీ

జైపూర్:జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు ఈడీ(ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్)గా విధులు నిర్వహిస్తున్న ఎన్‌వీ.రాజశేఖర్‌రావు బదిలీ అయ్యారు. ఎస్టీపీపీ జీఎం, ఇన్‌చార్జి ఈడీగా పని చేసిన ఆయనను కార్పొరేట్ మార్కెటింగ్ జీఎంగా బదిలీ చేస్తూ యజామాన్యం సోమవారం ఉత్తర్వులు జారి చేసింది.

### హడలెత్తిస్తున్న పెద్దపులి

భీమిని: బెల్లంపల్లి డివిజన్ ప్రజలను పెద్దపులి భయపెడుతోంది. ఆదివారం రాత్రి బెల్లంపల్లి మండలం చెర్లపల్లిలో పులి సంచరించింది. సోమవారం కన్నెపల్లి మండలం ఎల్లారంవైపు వచ్చిందని తెలియడంతో ప్రజలు భయందోళనకు గురయ్యారు. ఎల్లారం నుంచి బొప్పారం అడవి దాటి వెళ్లినట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. తాండూర్ మండలం గోపాల్‌నగర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో పులి పాద ముద్రలను అధికారులు గుర్తించారు.



# మళ్లీ కంప్యూటర్ విద్య

- పీఎంశ్రీ పథకం కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 55 పాఠశాలలు ఎంపిక
- కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇన్వర్టర్లు మంజూరు


నస్పూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన కంప్యూటర్‌ల వద్ద విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: రోజురోజుకూ సాంకేతిక పెరుగుతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక విద్య ప్రతీ విద్యార్థికి అవసరమే. ఇందులో భాగంగా సర్కారు పాఠశాలలను ఆధునిక పరిశోధన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పాఠశాలల్లో మళ్లీ కంప్యూటర్ విద్య అమలు చేయాలని నిర్ణయించింది. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలనే ఉద్దేశంతో మొదటి విడతలో ఎంపికైన పీఎంశ్రీ పాఠశాలలకు పది డెస్క్‌టాప్ కంప్యూటర్లు, ఒక ప్రింటర్, 2 కేవీ ఇన్వర్టర్‌ల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 487 పాఠశాలలకు 4,870 కంప్యూటర్లు, 487 ప్రింటర్లు, 974 2కేవీ ఇన్వర్టర్లు మంజూరు చేస్తూ ఈనెల 14న పాఠశాల స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ సమగ్ర శిక్ష నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. పాఠశాలలో కంప్యూటర్ విద్య విద్యార్థులకేరీర్ అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇంటర్నెట్‌తో కూడిన కంప్యూటర్ అనేది విద్యార్థులుకొత్త నైపుణ్యాలు, ప్రస్తుత పాఠాల అధునాతన వెర్షన్‌ను నేర్చుకోవడానికి దోహద పడనుంది.

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..**

పీఎంశ్రీ పథకం కింద మొదటి దఫాలో ఎంపికైన ఉన్నత పాఠశాలల్లో సాంకేతిక విద్య అమలులోకి రానుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్మల్‌లో 16, మంచిర్యాలలో 16, ఆదిలాబాద్‌లో 13, ఆసిఫాబాద్‌లో 10 పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలలకు కంప్యూటర్లు, ప్రింటర్లు, 2 కేవీ ఇన్వర్టర్లు మంజూరు చేశారు. సెల్కాన్ ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సామగ్రిని పాఠశాలలకు సరఫరా చేయనుంది. ప్రతీ ఎమ్మార్సీకి సరఫరా చేయబడిన ఎలక్ట్రికల్, నెట్‌వర్కింగ్ సిస్టమ్‌తో పాటు డెస్క్‌టాప్, ప్రింటర్లు, యూపీఎస్ సిస్టమ్‌లు, ఐసీటీ మెటీరియల్ వివరాలు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పరికరాలు ఇన్‌స్టాలేషన్ చేసిన తర్వాత ధృవీకరించాలి. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ఆధారిత విద్యావిధానం అమల్లోకి వచ్చిన కొంతకాలానికి అటకెక్కింది. 2005లో పాఠశాలలకు కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటు చేసినా ఒప్పంద గడువు తీరడం.. బోధకులు లేకనో కంప్యూటర్ విద్య మరుగనపడింది. గతేడాది మరోసారి ఐసీటీ స్కూల్ ప్రాజెక్టు కింద 47 పాఠశాలలకు సమగ్రశిక్ష నిధులతో ఒక్కో పాఠశాలకు 5 నుంచి 10 వరకు కంప్యూటర్లు వచ్చాయి. ప్రత్యేక బోధకులు లేకపోవడం, శిక్షణ ఇవ్వకపోవడంతో కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి. లక్షలాది రూపాయలు వెచ్చించిన ప్రభుత్వం బోధకులను నియమించకపోవడంతో సాంకేతిక విద్య మిథ్యగానే మారుతోంది.

**‘పీఎంశ్రీ’ కింద పాఠశాలల్లో..**

పీఎంశ్రీ పథకం కింద జిల్లా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 55 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇప్పటికే ఫీల్డ్ ట్రిప్, ఎక్స్‌పోజర్ విజిట్, సైన్స్, మ్యాథ్స్ యాక్టివిటీ, స్కూల్ ఆన్యువల్ డే, ట్వినింగ్ మోటివేషనల్ లెక్చర్స్ నిర్వహణకు సంబంధించిన నిధులు విడుదలయ్యాయి. ఇదివరకు పీఎం శ్రీ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఫీల్డ్‌టూర్‌కు తీసుకెళ్లారు. ఎన్టీపీసీ, అగ్రికల్చరల్ (వ్యవసాయక్షేత్రాలు), పరిశ్రమలు.. ఇలా క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. రామప్ప టెంపుల్, లక్నవరం, వెయ్యిస్తంబాల గుడి, కాకతీయ తోరణం ఇలా చారిత్రాత్మక కట్టడాలు, పర్యాటక ప్రదేశాల సందర్శనకు వెళ్లారు. ఈఏడాది కొత్త ప్రదేశాలను వీక్షించేందుకు పర్యటనలు సాగుతున్నాయి. పాఠశాలల్లో సౌర విద్యుత్, ఎల్‌ఈడీ విద్యుత్ దీపాల ఏర్పాటు, తోటల పెంపకం, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత చర్యలు, బొమ్మలతో బోధన, విద్యార్థుల సామర్థ్యాల ముదింపు వంటివి చేపడుతారు. ఉపాధి అవకాశాలపైనా అవగాహన క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విస్తృతంగా నిర్వహణతో పాటు సాంకేతిక విద్య వైపు అడుగులు పడుతుండటంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువకులు మృతి


సంఘటన స్థలంలో మృతదేహం


బాలాజీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

- రోడ్డు ప్రమాదంలో ఒకరు, గోదావరిలో మునిగి మరొకరు దుర్మరణం

బాసర: నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలో వేర్వేరు ఘటనల్లో మహారాష్ట్రకు చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు (24) ద్విచక్ర వాహనంపై నిజామాబాద్ నుంచి నాందేడ్ వెళ్తుండగా బాసర ట్రిపుల్‌ఐటీ వద్ద భైంసా నుంచి నిజామాబాద్ వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా కారు డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన యువకుడిని అంబులెన్సులో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

**గోదావరిలో మునిగి యువకుడు..**

మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ మండలం రత్నల్లి గ్రామానికి చెందిన పవార్ బాలాజీ (28) బాసర గోదావరిలో పుష్కరఘాట్ వద్ద స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడిపోవడంతో మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

# అంత్యక్రియలకు వెళ్లి అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

లక్సెట్టిపేట: బంధువుల అంత్యక్రియలకు వెళ్లి తిరిగివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల మేరకు మందమర్రి మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన నూర శేఖర్ (32) ఆదివారం కడెం మండలంలో జరిగిన బంధువుల అంత్యక్రియలకు హాజరయ్యాడు. సాయంత్రం బైక్‌పై ఇంటికి తిరిగివస్తుండగా లక్సెట్టిపేట మండలంలోని వెంకట్రావ్‌పేట ఎక్స్‌రోడ్డు వద్ద ఎదురుగా వచ్చిన పందిని తప్పించబోయి కిందపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో 108లో మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. మృతుని భార్య అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

### ఐదుగురికి జరిమానా

మంచిర్యాలక్రైం: పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధిస్తూ మొదటి అదనపు జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి డీ.ఉపనిషద్వని సోమవారం తీర్పునిచ్చినట్లు ఎస్సై సుగుణాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 2017 ఆగస్టు 20న సీసీసీ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న దార శివప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాస్ రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతంలోని సింగరేణి క్వార్టర్ టీ. 106 డోర్‌ను కొట్టగా తలుపుతీసిన చందుపట్ల సురేందర్‌రెడ్డి, దెబ్బటి పూర్ణచందర్, కోదారి కుమారస్వామి, కుంబార్‌కార్ సంతోష్, మామిడిపెల్లి వినోద్ వారిని బూతులు తిడుతూ దాడికి యత్నించారు. సదరు కానిస్టేబుళ్ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ సమర్పించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంది రవీందర్ సాక్ష్యాధారాలు కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువు కావడంతో ఐదుగురికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

### మతిస్థిమితం లేని మహిళ మృతి

రెబ్బెన: మతిస్థిమితం లేని ఓ మహిళ అపస్మారక స్థితిలో వెళ్లి మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆసిఫాబాద్ మండలం రౌటసంకెపల్లి గ్రామానికి చెందిన గజ్జెల హన్ను‌బాయికి తాండూర్ మండలం వాసలమడుగు గ్రామానికి చెందిన టీకం రాముతో పదేళ్ల క్రితం వివాహమైంది. ఆమె భర్త మూడేళ్ల క్రితం మృతి చెందడంతో అప్పటి నుంచి మతి స్థిమితం కోల్పోయింది. ఇంటి పట్టున ఉండకుండా ఊర్ల వెంట తిరుగుతుండేది. దీనికి తోడు మద్యం కూడా సేవిస్తుండేది. ఈ క్రమంలోనే సోమవారం రెబ్బెన మండలంలోని గోలేటిలో ఉన్న భీమన్న గుడి వద్ద అపస్మారక స్థితిలో పడిపోయింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతురాలి తండ్రి గజ్జెల చిన్న భీము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### అర్బన్‌పార్కులో చెలరేగిన మంటలు


అర్బన్ పార్కులో కాలుతున్న గడ్డి

నేరడిగొండ: బోథ్ ఎక్స్‌రోడ్ ప్రాంతంలో గల కుంటాల సోమన్న అర్బన్ పార్కులో సోమవారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి నాలుగు హెక్టార్లలో గడ్డి కాలి బూడిదైంది. బోథ్ ఎఫ్ఆర్‌వో ప్రణయ్ కుమార్ సిబ్బందితో కలిసి నీటి ట్యాంకర్ల ద్వారా మంటలు ఆర్పివేశారు. అయితే ఆ పార్కులో ఏటా మొక్కలు నాటుతున్నారు. వేసవిలో ఏటా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటోంది. బోథ్ ఎక్స్‌రోడ్ ప్రాంతంలో ధూమపానం చేసి ఎవరైనా అగ్గిపుల్లలను పడేసి ఉండడంతో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు పలువురు చర్చించుకున్నారు.

### బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు

ఇంద్రవెల్లి: బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. మండల కేంద్రంలోని జాలంతాండ చౌక్ వద్ద అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించగా రూ.3,762 విలువైన మద్యం లభించినట్లు ఆయన పేర్కొన్నారు. బెల్టుషాపు నిర్వాహకుడు బరద్వల్ నానాక్‌సింగ్‌పై కేసు నమోదు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

### ఆక్యూ లివర్ ఫెయిల్యూర్‌తో చిన్నారి మృతి


నివేక్ష (ఫైల్)

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామానికి చెందిన తోడిశెట్టి లక్ష్మణ్-నవ్య దంపతుల పెద్ద కుమార్తె నివేక్ష(8) ఆక్యూ లివర్ ఫెయిల్యూర్‌తో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. చిన్నారికి రెండేళ్ల వయసు నుంచే కాలేయ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. లక్ష్మణ్ బట్టల దుకాణంలో పనిచేస్తుండగా నవ్య బీడీలు చుడుతూ కుటుంబానికి బాసటగా నిలుస్తోంది. కుమార్తెను కాపాడుకునేందుకు రూ.10 లక్షల వరకు అప్పులు చేశారు. కుటుంబానికి బాసటగా నిలిచేందుకు దాతలు ముందుకు వచ్చినా ఫలితం లేకుండా పోయింది. అయినా చిన్నారి ప్రాణాలు కాపాడుకోలేకపోయామని తల్లిదండ్రులు రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

### చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్య తీసుకోవాలి


పీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: పెసా చట్టం 5వ షెడ్యూల్‌లోని 1/70 చట్టాన్ని ఉల్లంఘించి ఏజెన్సీ ప్రాంతంలో భూమి ఆక్రమించుకున్న అక్రమార్కులపై, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్మకి రామారావు సోమవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చోడ మండల శివారులోని సర్వేనంబర్ 120/1/1లో 3.30 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాచేసిన అక్రమార్కులు లేఔట్‌లు ఏర్పాటు చేశారన్నారు. సర్వే నంబర్ 120/లలో 7.20 ఎకరాల మైనార్టీ పాఠశాల భూమిలో దాబాహోటల్ ఏర్పాటు చేశారన్నారు. విషయాన్ని తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఓమేశ్, దేవ్‌రావు, శంభు, లింగు, శేఖర్ పాల్గొన్నారు.

# ‘సుకురా’కు ఎంపికైన అక్షర


వరిగడ్డితో చేసిన కుండీలను ప్రదర్శిస్తున్న అక్షర

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామానికి చెందిన అక్షర జపాన్‌లోని పాఠశాల విద్యావ్యవస్థ తీరును అధ్యయనం చేసి ఆలోచనలు పంచుకునేందుకు ఏర్పాటు చేసిన సుకురా కార్యక్రమానికి ఎంపికైంది. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలోని ఆస్నాదకు చెందిన ముకుం తిరుపతి, శోభ దంపతుల కుమార్తె అయిన అక్షర ప్రస్తుతం కాగజ్‌నగర్‌లోని నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతోంది. తండ్రి తిరుపతి ప్రభుత్వ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా తల్లి శోభకు కూడా ఇటీవలే ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం వచ్చింది.

**జాతీయ స్థాయిలో ఆకట్టుకున్న ప్రదర్శన**

గతేడాది సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు ఢిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో వరిగడ్డితో చేసిన కుండీలను ప్రదర్శించింది. రైతులు వరి పంట కోసిన అనంతరం గడ్డిని పొలాల్లోనే కాలుస్తుంటారు. దీంతో కాలుష్యం ఏర్పడుతుంది. ఇలాంటి కాలుష్య నివారణకు అక్షర వినూత్న రీతిలో తన ఆలోచనకు పదును పెట్టింది. మెంతులను తడిపి నూరి, వరి గడ్డితో కలిపి ముద్దగా చేసి ఎలాంటి ఆకారం కావాలంటే అలాంటి ఆకారంలో మొక్కలను పెంచేందుకు కుండీలను తయారు చేసింది. వాటిని ఆరబెట్టి అందులో మట్టిని నింపి విత్తనాలు నాటగా మొలకెత్తి మొక్కలుగా ఎదిగాయి. ఇలాంటి వాటితో నర్సరీలలో కలుషితమైన ప్లాస్టిక్ సంచులలో మొక్కలను పెంచడాన్ని నివారించి సహజ సిద్ధమైన కుండీలలో మొక్కల పెంపకం చేపట్టవచ్చని వివరించింది.

**జపాన్ వెళ్లేందుకు ఎంపిక**

సుకురా కార్యక్రమానికి వెళ్లేందుకుగానూ దేశంలోని 54 ఉన్నత పాఠశాలల్లోని 137 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. అందులో తెలంగాణ నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికకాగా అందులో మంచిర్యాల జిల్లాకు చెందిన అక్షర ఉండడం గర్వకారణం. ఎంపికైన విద్యార్థుల బృందం రాబోయే విద్యాసంవత్సరంలో జూన్ 15 నుంచి 21 వరకు జపాన్‌లో పర్యటించి అక్కడి విద్యా వ్యవస్థ, సాంకేతిక ఆలోచనలను పరిశీలించనున్నారు.

# సమష్టి కృషితో సింగరేణికి భవిష్యత్

- సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్



మాట్లాడుతున్న ఎన్.బలరామ్

నస్పూర్:సింగరేణి సంస్థ సుస్థిర భవిష్యత్తు సంస్థలో పనిచేసే ప్రతీ అధికారి, ఉద్యోగి బాధ్యత అని సీఎండీ ఎన్.బలరామ్ అన్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల జీఎంలు, 39 గనుల ప్రాజెక్టు అధికారులతో సోమవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ సింగరేణి ఉన్నతికి అహర్నిశలు కృషి చేసేవారికే కంపెనీలో చోటుంటుందన్నారు. లక్ష్య సాధనలో ఉద్యోగులను భాగస్వాములను చేస్తూనే క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రానున్న 43 రోజులలో నిర్దేశిత లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా సాధించాలని సూచించారు. రోజుకు 2.6 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరగాలని, 17 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్‌బర్డెన్ తొలగించాలని ఆదేశించారు. నూతన గనుల విషయంలో అపరిష్కృతంగా ఉన్న భూసేకరణ, పర్యావరణ అనుమతులకు త్వరగా చర్యలు తీసుకోవాలని జీఎంలను ఆదేశించారు. ఇటీవల తాను బెల్లంపల్లి, రామగుండం రీజియన్లలోని 20 గనులను సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నానని తెలిపారు. క్షేత్రస్థాయిలో వాటిని పరిష్కరించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల్లో నైపుణ్యం పెంపుదలతోపాటు గనుల్లో మ్యాన్ రైడింగ్ వ్యవస్థలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతీ ఉద్యోగి అధికారి ఒక జట్టుగా పని చేస్తూ సంస్థను అగ్రస్థానంలో నిలబెట్టాలన్నారు. మాస్టర్ పడి బయటకు వెళ్లే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు డి.సత్యనారాయణ(ఈఅండ్‌ఎం), ఎల్వీ.సూర్యనారాయణ (ఆపరేషన్స్), వెంకటేశ్వర్లు (పీఅండ్‌పీ), మోహన్‌పర్గేన్(జీఎం కోఆర్డినేషన్), అధికారులు సుభాని, మనోహర్, రవిప్రసాద్, అన్ని ఏరియాల జీఎంలు ప్రాజెక్టు అధికారులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతుల దుర్మరణం

- అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన బైక్
- పంట విక్రయించి వస్తుండగా ఘటన


సాయన్న (ఫైల్)


మహేందర్ (ఫైల్)

సారంగపూర్: పంట విక్రయించి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతులు మృతి చెందిన సంఘటన మండలంలోని ధని గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై నల్ల శ్రీకాంత్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ధని గ్రామానికి చెందిన కొప్పుల సాయన్న (50), ఆయిటి మహేందర్ (45) తాము పండించిన నువ్వుల పంటను విక్రయించడానికి సోమవారం నిర్మల్ మార్కెట్‌కు వెళ్లారు. అక్కడ పంట విక్రయించిన అనంతరం బైక్‌పై ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో చించోలి(బి)-ఆలూరు ఎక్స్‌రోడ్డువద్ద వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టారు. ఘటనలో కొప్పుల సాయన్నకు తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఆయిటి మహేందర్‌ను నిర్మల్‌లోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఇద్దరు రైతుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మహేందర్‌కు భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు, సాయన్నకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు రోదించిన తీరు ప్రతిఒక్కరినీ కలిచివేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# పాతికేళ్ల తర్వాత అంతా ఒకచోట..


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, గురువులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో పదోతరగతి 1999–2000 బ్యాచ్‌కు చెందిన 96 మంది విద్యార్థులు ఆదివారం రాత్రి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాతికేళ్ల తర్వాత అందరూ కలిసి తాము చదివిన పాఠశాలలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పద్మజ, పూర్వవిద్యార్థులు, గురువులు బి.సత్యనారాయణ, సత్తయ్య, పాపారావు, కనకయ్య, చారి, నర్సయ్య, నూర్ షరీఫ్, గణపతిరెడ్డి, కన్నయ్య, విజయలక్ష్మి, రఫియా సుల్తానా, సరళారాణి, స్వరూపారాణి, జహీరా బేగం, ఉదయ, తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి జైలర్.. ప్రవృత్తి సింగర్

- ఆకట్టుకుంటున్న సత్యం పాటలు


పాటలు పాడుతున్న సత్యం

జన్నారం: ఒకవైపు వృత్తి ధర్మాన్ని పాటిస్తూనే మరోవైపు తనకు ఇష్టమైన పాటలు పాడుతూ ఆకట్టుకుంటున్నాడు జైలర్ బత్తుల సత్యం. ఆలోచింపజేసే పాటలు పాడుతూ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నాడు. పాటలు పాడటమంటే తనకు ఇష్టం కనుకనే అప్పుడప్పుడు తానే పాటలురాస్తూ పాడుతున్నట్లు చెబుతున్నాడు. జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన బత్తుల సత్యం రైతు కుటుంబంలో జన్మించాడు. పదో తరగతి వరకు జన్నారం బాలుర ఉన్నత పాఠశాలలో, డిగ్రీ వరకు హైదరబాద్‌లో చదివాడు. 2010లో జైలర్‌గా ఉద్యోగం సాధించాడు. ఉమ్మడి రాష్ట్రంలో నర్సపూర్‌లో మొదటి పోస్టింగ్ తీసుకున్నాడు. అనంతరం జనగామ, చర్లపల్లి, జగిత్యాల జైలర్‌గా విధులు నిర్వర్తించి ప్రస్తుతం చర్లపల్లికి బదిలీపై వెళ్లాడు.

**చిన్ననాటినుంచే..**

తాను చదువుకుంటున్నప్పటి నుంచే పాటలు రాయడం, పాడడం అంటే తనకు ఇష్టమని చెబుతున్నాడు. అప్పటి పరిస్థితుల దృష్ట్యా రాయలేకపోయానని, జైలర్‌గా విధుల్లో చేరి సమయం దొరికినప్పుడు పాటలు రాస్తున్నట్లు ఆయన పేర్కొంటున్నాడు. పాటలు రాయడంతో పాటుగా లిరిక్స్ తీసుకుని తానే స్వయంగా పాడినట్లు తెలిపాడు. కళ్ల ముందే జరిగిన పరిస్థితులను పాటగా మలిచినట్లు ఆయన పేర్కొన్నాడు.

**ఖైదీలపై , జైలు జీవితంపై..**

సత్యం ఆరు పాటలు రాశాడు. అందులో మూడు పాటలు మంచి పేరు తీసుకువచ్చాయి. ఇందులో కరోనా పరిస్థితులపై , జైలు జీవితం, ఖైదీలలో వస్తున్న సత్ప్రవర్తన గురించి ఆయన పాటలు రాసి పాడారు . ఖైదీల మార్పు , కరోనాపై రాసిన పాటలు మంచి పేరు తెచ్చాయి. భరోసా నిస్తుంద్రు, బాధ్యత తెలిపింద్రు అని ఖైదీలపై రాసిన పాట, ‘కరచాలనం వద్దు, నమస్కారం ముద్దు’ అని కరోనా గురించి రాసిన పాటలు పేరు తెచ్చినట్లు తెలిపాడు. సమయం దొరికినప్పుడు మరిన్ని పాటలు రాయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపాడు.

**పాడడం ఇష్టం**

చిన్ననాటి నుంచే పాటలు పాడడం ఇష్టం. చదువుకునే సమయంలో నా స్నేహితులతో కలిసి సరదాగా పాడేవాడిని. ఆ సమయంలో సరిగా దృష్టి పెట్టలేకపోయా. ఉద్యోగంలో చేరాకా సమయం దొరికినప్పుడు, చుట్టూ జరిగే పరిస్థితుల గురించి పాటలు రాశాను. వాటిని స్వయంగా పాడి నా యూట్యూబ్ చానల్‌లో అప్‌లోడ్ చేసుకున్నా. రెండు, మూడు పాటలు మంచి పేరు తెచ్చాయి.

– బత్తుల సత్యం, జైలర్